# హా శ్య నా టి క

## అభినవ కురుక్షేత్రము


ర చ యి త

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**



**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

## HASYA NATIKA

(A Telugu Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**


ప్రథమ ముద్రణ : 1977 (2000 ప్రతులు )

పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు



ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,<br>రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్<br>హైదరాబాద్ -500084. Cell -9440495887.

: 2. నండూరి విద్యారణ్య స్వామి , ప్లాట్ నం .:154,<br>స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ, నిజాం పేట<br>హైదరాబాద్ -500090. Cell -9391028231 .



వెల : రూ.60/-.



సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# హా శ్య నా టి క

## అభినవ కురుక్షేత్రం

నాంది

శ్రీ భూమండలమందు భారతి జగజ్జీవన్ నవోన్మేషయై
సౌభాగ్యాధి జయప్రకాశ ఋషివత్ సౌశీల్య దేశాయితా
శోభాశ్రీ మకుటాయమాన యగుతన్-జ్యోత్స్నాభి షిక్తాంగి- గం
గా భాగీరథి పారుచున్న జనతా గాథా కురుక్షేత్రయై.

నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించి నటితో

అదిగో ! హస్తిన!! ఎఱ్ఱకోట అదిగో! ఆ మూల కన్పట్టు – అ
య్యడియే జంతరు మంత రయ్యదియె ఉద్యత్ పార్లమెంట్ సౌధ మ
య్యదియే చూడ కుతుబ్ మినారు శిఖరం బాప్రక్క సూర్యాత్మజా
నది-మూకాభినయమ్ము సల్పెడి పురానానా చరిత్ర స్మృతుల్ !

నటి

ఆర్యపుత్రా ! మీ కోరిక ఈడేరినది. అయితే మనం క్రొత్త ఢిల్లీ చేరినట్లా? పాతఢిల్లీకి వచ్చినట్లా?

సూత్రధారి

మనం చేరింది సరిక్రొత్త ఢిల్లీ ! ఈ ఐదు వేల సంవత్సరాల చరిత్రలో పాతఢిల్లీ ఎన్నిసారులు క్రొత్తఢిల్లీ అయిందో ! ఎన్ని సారులు కొత్తఢిల్లీ పాతఢిల్లీ అయిందో ? ఎవరు చెప్పగలరు !

నటి

ఈ ప్రపంచంలో ఇప్పుడూ ఇంతకంటె పవిత్ర పురాతన చరిత్ర ఉన్నట్టి సజీవ రాజధాని లేదేమో!! నిజమే!

ఇచ్చోటకే కదా ! ఏకాదశాక్షౌహి

ణీనేత మీసాలు నేల గలసె !

ఇచ్చోటనే! అస్తమించెను రవి అస్త

మించిని రాజ్యపు మిసిమి పసలు!

ఇచ్చోటనే! పేరు క్కిన గోరీలు

తామరతంపరై తారసిల్లు!

ఇచ్చోటనే! యెుంద రెందరో రాణుల

మంగళ సూత్రాలు వంట గలసె !

ఈ సనాతన ఢిల్లీ పురీంద్ర మందు,

తరతరాల ద్రవీభూత చరిత - యమున !

ఈ మహాప్రౌఢ కల్లోలినీ మతల్లి !

నడచు - నవ్వుకొనుచు - నంగనాచి వోలె ! !

నటి

ఆర్యపుత్రులీనాడు అభినవోత్సాహంతో ఉన్నారు!

సూత్రధారి

అవును కల్యాణీ ! ఈనాడు ఇచ్చట మనం అభినవ కురుక్షేత్రం అనే అధునాతన రాజకీయ ప్రహసనం ప్రదర్శించవలసి వుంది.

నటి

చరిత్రాత్మకమైన ఈ ఢిల్లీ మహానగరంలో ఆడవలసింది అభిరూప శ్రేష్ఠులు మెచ్చే నాటకమా ! వేళాకోళం వెక్కిరింతలతో వెగటు పుట్టించే ప్రహసనమా ?

హాస్యరస ప్రధానమైన రాజకీయ ప్రహసనం విలువ పరిహాస రసికులకు తెలుసు, అందరూ ఆనందించేది హాస్యరసం..

నవ్వు వానితోడ నవ్వు ఈ జగమెల్ల !

ఏడువానితో ఏడ్వరెవరు !

నవ్వినపుడు చెందు నరుడు జీవన్ముక్తి

బ్రదుకు క్రుంగదీయు బరువు మరచి,

అందుచేత ఏకో రసో హాస్య "ఏవ" - అని నేనంటాను.

నటి

అభినవ కురుక్షేత్రం ఏమిటి? హాస్యం ఏమిటి? రాజాకీయాల్ని హాస్యాన్ని మిళితం చేయటం అంటే పొడినీరు తడి అగ్గి కలిపినట్లే!

సూత్రధారి

కాదు ! కాదు ! రాజకీయ దార్శనిక ప్రవక్తగా పేరుకెక్కిన 'చర్చిల్' - ఇంగ్లండులో యుద్ధసమయంలో ప్రధాని - పరిహాసానికి మాత్రమే భయపడేవాడట.

పరమ దారుణమ్ము పరిహాసమే సుమ్ము!
అసలు నిజము దాగు హాస్యమందు ;
హాస్యరసము సాటి హాలాహలము కాదు !
గరళగళునకైన వెరపు గొలుపు.

నటి

హాస్యం అంటే ఏమిటండీ! ఒకరిని నవ్వించి - పది మందిని ఏడ్పించి - నూరుమందికి అర్థం గాకుండా - వేయిమందికి అపార్థం కల్పించే కాళ్ళూ చేతులూ తెగిన కుంటిమాటలు గాక ---

సూత్రధారి

కాదు ! కల్యాణీ! కాదు కాదు.

సానుభూతి గలిగి, సంస్కరింపగ గోరి,
వేడి కంటినీరు వెనుకదాచి,
హాస్యమాడవచ్చు అనురాగ మున్నచో;
విసము గక్కకుండ వెక్కిరించి !

నటి

అయితే అభినవ కురుక్షేత్రం వ్రాసిన కవీశ్వరు డెవ్వరు ?

సూత్రధారి

సరసుడౌ రామకృష్ణమాచార్య సుకవి.

ప్రగతి గీతా ప్రవక్త ; బాష్పాలు రాల్చి,

వ్రాసె అపర కురుక్షేత్ర ప్రహసనమ్ము;

నవ్వుటాలకే ! వట్టి ఆనందమునకె !

అది కేవలం కల్పితం - పరిహాస విజల్పితం. అందులో పరమార్థ మేమీ లేదు.

(తెరలో ; కలకలం)

జనతాపార్టీకీ జై - శ్రీ జయప్రకాశ నారాయణ జిందాబాద - శ్రీ రాజనారాయణ జిందాబాద్

నటి

ఆర్యపుత్రా ! తెరలో ఈ కలకలం దేనికి ?

సూత్రధారి

అదుగో ! అభినవ కురుక్షేత్రంలోని పాత్రవర్గం అంతా రంగస్థలం నీలికి వస్తున్నారు,

నటి

ఢిల్లీ నగరంలో - స్వరాజ్యం వచ్చిన తరువాత ఇంతటి కలకాలం ఎన్నడూ కనీ వినీ యెరుగఁ. జనతాపార్టీ విజయం అద్భుతం! పర మాద్భుతం !!

సూత్రధారి

చరిత్రలో ఎన్నో అద్భుతాలు జరిగాయి! చూడూ! నిన్నమొన్నటి వరకూ కాంగ్రెసు నాయకులకు జేజేలు పలికిన ఈ ఢిల్లీ పౌరులు  నేడు జనతాపార్టీనాయకులకు ఆ ముక్త కంఠాలతో జిందాబాదులు, జయధ్వానాలు వర్షిస్తున్నారు.

(తెరలో)

శ్రీ రాజనారాయణ జిందాబాద్

నటి

ఆహా! ఒక్క అర్ధరాత్రిలో శ్రీ రాజనారాయణ్ మహానాయకుడైనాడే !

సూత్రధారి

శ్రీ రాజనారాయణ్ రాయ్ బరీలో నుండి ఢిల్లీ చేరుకున్నాడన్న మాట.

శ్రీమతి ఇందిరా రమణి సింహపు కోరలు పీకినట్టి - ఈ
భీమ పరాక్రముండు - ప్రతివీర భయంకర ధీర నాయక
గ్రామణి డాసిన్ బహుపరాకులు దిగ్విజయోస్తులున్ - సదా
ప్రేముడి మీర పల్కెదరు ప్రేక్షకులెల్లరు పుల్కరించుచున్ !

అయితే - ఇప్పుడు ప్రధానమంత్రి ఎవ్వరు అవుతారు ? జనతాపార్టీ గెలిచింది కదా !

సూత్రధారి

శ్రీమతి ఇందిరాగాంధీ ఓడినమాట నిజమేగాని ఇంకా అప్పుడే జనతాపార్టీ గెలిచిందనటానికి వీలులేదు.

(అపటి క్షేపంగా శ్రీ రాజనారాయణ్ ప్రవేశం)

ఎవరురా ?? ఈ అభినవ దుర్యోధన దుశ్శాసన దుర్మదాంధ దుష్ట బుద్ధులు ? మా జనతాపార్టీ నెగ్గ లేదంటున్నారు! !

ఈ యభినేత ఎవ్వడని యెంచెదరో ! అవిజేయ రాజనా
రాయణ నామధేయుడ మహారథికో త్తముడన్ నరాంశ-నా
రాయణు అంశతో -విజయమందిన కారణజన్ముడన్ రస
స్థాయికి తెచ్చినాడ - ప్రియదర్శిని ఇందిర రాజకీయముల్ !

(తెరలో : శంఖనినాదాలు - విజయ దుందుభిస్వనాలు)

[ప్రవేశం శ్రీ జయప్రకాశ నారాయణ - కృపలానీ - మొరార్జీ దేశాయి - వాజ పేయి - అద్వానీ - జార్జి ఫెర్నాండెజ్ - బహుగుణ - జగజీవన్ రామ్ - నానాజీ దేశముఖ్ మోహన్ ధారియా ప్రభృతులు.]

మొరార్జీదేశాయి

అభినవ భారత భాగ్య విధాతలారా ! మీకందరకూ స్వాగత ధన్యవాదాలు. శ్రీ కృపలానికి స్వాగతం. విశేషించి శ్రీ జయప్రకాశ్ జీకి స్వాగతం (అటుదిరిగి)

నీకు స్వాగతమ్ము లోకైక నాయకా !
శ్రీ జయప్రకాశ చిద్విలాస !

అవధరింపవయ్య - అభినవాంబుజనాభ !

విజయ సూత్రధారి ! విన్నపము.

ఇచ్చటచేరిన జనతాపార్టీ నాయకులందరిపక్షాన - నా పక్షాన శ్రీ జయప్రకాశ్ మీకు ధన్యవాదాలు.

వాజపేయి

(ఆపవారించి అద్వానీతో) ప్రియ మిత్రమా ! మొరార్జీభాయి లౌక్యం అంతగా తెలియని మొరటు మనిషి అనుకొని మనం రాత్రి అంతా భయపడినాము గాని విన్నావా, ఎంత సుకుమార సుందర సుస్నిగ్ధ స్వరంతో శ్రీ జయ ప్రకాశ్ కు  స్వాగతం చెబుతున్నాడో! తన ఆత్మకథలో అప్పుడు ఏమి వ్రాసినా ఇప్పుడు మాత్రం - మీగడ తిన్న పిల్లి వ లె - వస పోసిన చిలుకవలె కొబ్బరికాయ - నీరు త్రాగిన గాయకోత్తమునివలె కంఠస్వరం మార్చాడు. ఇంక పరవాలేదు. మనవాడు మన కత్తులో కలిసినట్లే, కథ రక్తి కడుతుందిలే.

మొరార్జీదేశాయి

ఈనాడు మనం జరిపేది చరిత్రాత్మకమైన సమావేశం. ఈ ఎన్ని కలు ద్వితీయ స్వాతంత్ర్య సమరం అని చెప్పాలి.

అధ్వాని

అధ్యక్షులకు ఒక గమనిక. ఇది తృతీయ స్వాతంత్ర్య సంగ్రామం. భారతదేశంలో శ్రీ గాంధీగారికి శ్రీ మొరార్జీ భాయికి ముందే ఉద్భవించిన దేశ భక్తులున్నారని మరచిపోరాదు. ఆంగ్ల మానస పుత్రులు - సిపాయీల తిరుగుబాటు అంటున్నారే అది ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమని జ్ఞాపకం చేయటం నా పవిత్ర ధర్మంగా భావిస్తున్నాను.

మొరార్జీదెశాయి

నా మనస్సులో ఉన్నమాట ద్వితీయ స్వాతంత్ర్య శాంతి సమరం అనే. "సిపాయీల తిరుగుబాటు" అని నేను ఎన్నడూ అనలేదు. అనను. అది నిస్సందేహంగా స్వాతంత్ర్య సంగ్రామమే (హర్షధ్వానాలు)

వాజపెయి

(అపవారించి అద్వానీతో) మిత్రమా! అగ్రజుడైన ఈ అపర ధర్మజుడు జాగ్రత్త సుమా ! మెత్తని పులి.

మొరార్జీదేశాయి

ప్రపంచంలోకెల్ల పెద్దదైన ప్రజాస్వామికం భారతదేశంలో ఇంకాబ్రతికే వున్నదని రుజువైనందుకు యావజ్జగత్తు

సంతోషిస్తోంది. ఇక ప్రకృతం.

నాయకు లెల్ల చేరిరి - నూతన భారత రాజధానిలో

ఈ యుదయమ్ము నందు ప్రకటించిరి గాంధి సమాధి వద్ద - గాం

ధేయ పథమ్ములో భరతదేశము దిద్ద-జయప్రకాశ నా

రాయణ నిర్వహించె-శపథాంజలి యజ్ఞము-ఋత్విజుండుగన్.

ఈనాటి సభా ప్రారంభం చేయవలసిందిగా - పూజ్యశ్రీ కృపలానీ గారిని కోరుచున్నాము.

కృపలానీ

మీ అందరకు నా హృదయపూర్వకమైన అభినందనలు. ఇది ప్రజాస్వామిక విజయం అని మనం సంతోషిస్తున్నాము ప్రజాస్వామ్యం అంటే అధిక సంఖ్యాకుల పరిపాలనే గదా! 'అధిక సంఖ్యా కులు' - తప్పుచేయగూడదా ? జంగమ విజ్ఞాన సర్వస్వం అని పేరొందిన సోక్రటీసుకు మరణ దండన విధించింది - ప్రజాస్వామ్య ప్రభుత్వమే.

ఏల కోరుకొనుట ఈ ప్రజాస్వామ్యమ్ము

దొసగు లిన్నియున్న దొరతనమ్ము?

ఇంతకంటె చెడ్డ వితర రాజ్యాంగముల్!

గ్రుడ్డికంటె-మెల్ల - కొంత మేలు.

మోహన్ ధారియా

మనం ఇక్కడ చేరింది ప్రధానమంత్రిని ఎన్నుకునేందుకు. శ్రీ జయప్రకాశ్ సందేశం వినిపించాలి.

జయప్రకాశ్ నారాయణ

స్వేచ్ఛ కొరకు-విడుచు--వేడి నిట్టూరుపుల్

కందకాల నీది, గవను లెగసి,

తగులబెట్ట గలవు - దౌర్జన్య దుర్గముల్ !!

బురుజులెల్ల కాల్చి బుగ్గిచేసి.

మీమీ అభిమతాలు వ్రాతమూలకంగా మాకు ఇవ్వవచ్చు, నేనూ, శ్రీ కృపలానీ చేసేపని కూడికలు మాత్రమే.

రాజనారాయణ్

వ్రాతలూ కోతలూ కావాలా! మా మనస్సులు మీకు తెలుపుతే చాలదా? అదీగాక మేమందరం మీ అభిప్రాయం ప్రకారమే నడుస్తాం.

జార్జి ఫెర్నాండెజ్

మనం మన నాయకుణ్ణి ప్రజాస్వామ్య సిద్ధాంతాల ప్రకారం ఎన్ను కోగల మని ప్రజలకు వాగ్దానం చేసి వున్నాము. సమర్థుడు- ఆదర్శ ప్రేరితుడు-యువకుడు అయిన నాయకుణ్ణి ఎన్నుకోవాలని నా అభిప్రాయం.

కృపలానీ

సమర్థుడు-ఆదర్శ ప్రేరితుడు -నాయకుడు కావాలని అనటం బాగుంది, యువకుడు అనే మాట ఎత్తవద్దని నా సలహా ...

పాతికేండ్ల వయసు పడుచు గాడిదకంటె

పరుగునందు-బ్రదుకు పందె మందు;

షష్టిపూర్తి యైన జవనాశ్వమే మేలు!

ఏన్గు  మేలు వందయేండ్లదైన;

మొరార్జీదేశాయి

ఈసారి ఎన్నికలలో పడిన చోట్లను బట్టి ప్రజలకు చేవదేరిన ముసలితనం మీదనే గౌరవం ఉన్నట్లు రుజువైంది.

జగజీవన్ రామ్

అసలు ...ఈ ఎన్నికలలో విజయ సాధనకు తోడ్పడిన సన్నివేశాలు మరచిపోరాదు.

బహుగుణ

శ్రీ జగ్ జీవన్ రామ్ మంత్రిమండలి నుంచి రాజీనామా ఇచ్చి బయటకు రావటంతో ఒక్కసారి అత్యద్భుతంగా వాతావరణంలో మార్పు వచ్చేసింది.

రాజనారాయణ్

అంతకుముందే జరిగిన సన్నివేశాలు జ్ఞాపకం చేసుకోండి. నా ఎన్నికల పిటిషనుపై అలహాబాదు హైకోర్టు తీర్పుకంటె అధునాతన భారత మహేతిహాసంలో అత్యద్భుతమైన సన్నివేశం మరొక్కటి ఉన్నదా?

కృపలానీ

మన ఘనవిజయానికి కారణం మన ప్రతాపమే కాకపోవచ్చు. ప్రతిపక్షం వారు చేసిన పొరపాట్లు మనకు తోడ్పడి ఉండవచ్చు. విజయానికి అనేక హేతువులుంటాయి.

రాజనారాయణ్

నిజమే —''ఎన్నికల వాతా వరణం ప్రతిక్షణం మారిపోతూనే ఉంటుంది.

నాయకురాలి మాయనటనమ్ముల - నీతి నిజాయితీలు-కూ
నీయయి- స్వేచ్ఛకున్ నిలువ నీడ లేక భయమ్ముచెంది, కెం
జాయ మొగాన గ్రమ్మిన ప్రజల్-చిరుస్టంటు తుపాకీ కాల్పుతో;
చీయని రోత పుట్టి నిరసించిరి టక్కరి రాజకీయముల్ !

మోహన్ ధారియా

ఈ అనుశాసన పర్వాన్ని అందరికంటే ముందే గుర్తించి - ఏకాంత సంకల్పంతో...నా మంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి సభాసదులు విస్మరించరనుకుంటాను.

విసరి వేయలేవు వింజామరలు వేయి
గగనమందు గ్రమ్ము కారుమబ్బు !
ప్రజల గుండెలందు రగులు సంక్షోభమ్ము
త్రోసిపేయలేవు శాసనాలు.

కృపలానీ

అసలు తప్పెవరిది? ప్రజలదే కాని ప్రభుత్వానిది కాదు ! !

దొరతనమ్ము చేయ తోడేళ్ళు సిద్ధమౌ !
మనుజులెల్ల గొట్టె మందలైన !
దేశమందు ఉన్న తెలివి తేటలబట్టి
దొరుకు ప్రజకు - తగిన దొరతనమ్ము !

జార్జి ఫెర్నాండెజ్

అయ్యా ! కృపలానీగారూ! మేము ఇక్కడ చేరింది ప్రధాన మంత్రిని ఎన్నుకునేందుకు. మృదుమధురమైన మీ

ఉపన్యాసాలు వినేందుకు ప్రత్యేక సభ ఏర్పాటు చేసుకుంటాము.

కృపలానీ

ఆయుధాలు కావు ! అణ్వస్త్రములు కావు !

భరతమాత కేది ప్రాణ రక్ష ?

చమురు గనులు కావు! హిమపన్నగము గాదు!

స్వేచ్ఛకోరు ప్రజల జీవశక్తి.

జార్జి ఫెర్నాండెజ్

(అపవారించి బహుగుణగారితో) సోదరా ! గంగా భాగీరథీ సమానుడైన పూజ్యశ్రీ ఆచార్య కృపలానీ ఏనాడో ఉపాధ్యాయ వృత్తి విడిచిపెట్టినా - ఇంకా ఆ పూర్వ సువాసన ఆయన్ను వీడటంలేదు. ఈ స్వపక్ష ప్రతిపక్ష నిర్ధూమధాముడు ఇక్కడ చేరిన నాయకులందరినీ కుఱ్ఱకుంకలైన విద్యార్థులవలెనైనా గాకుండా కేవలం కుక్కపిల్లలవలె చూస్తున్నాడు.

బహుగుణ

ఏం చేస్తాం. ఇక్కడకు ఈ ఇద్దరు ముసలిసింహాల్ని మనం ఆహ్వానించి తీసికొని వచ్చాం. సంతోషించు - వీరినేగాక ముసలి నక్కలను ఆహ్వానించి తీసికొనిరాలేదు.

కృపలానీ

సభ్యులు మౌనం పాటించాలి. ప్రశాంతంగా ఉండాలి. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

జయప్రకాశ్ నారాయణ్

ఇటువంటి సభలో సహజంగా కొంత కలవరం – కలరవం ఉంటుంది.

జగతియెల్ల కోరు శాంతినే మనసార !

స్వచ్ఛమైన శాంతి చాల అరుదు ;

నిద్రమత్తు మూర్ఛ ! నిస్సహాయత ! చావు!

మోసగించు శాంతి ముసుగు దాల్చి !

తస్మాత్ జాగ్రత జాగ్రత, ఈ అనుశాసన పర్వంలోని "శాంతి" మన అందరకు అనుభవ పునరుక్తం.

అద్వానీ

(ఆపవారించి - వాజపేయితో) వీరిద్దరూ ఇంక ఆలస్యం చేయ కుండా ఎవరిని ప్రధాన మంత్రిగా ఎన్నుకోవాలో చెప్పెయ్యగూడదా ? ఎందుకీ ముసుగులో గుద్దులాట ?

వాజపేయి

ప్రియ ముత్రమా (అపవారించి)

నీతి యేమి నుడువు? నిదురవోవుచు నుండు
కుక్క నెపుడు మేలు కొలుపరాదు ;
మూల మూల్గుచున్న ముసలి సింహము డాసి,
తోకనైన చేత తాకరాదు.

అందుచేత ఈ ముసలి సింహాలను కొంతసేపు గర్జించనీ తరువాత మన యిష్ట ప్రకారం చేద్దాం. ఇప్పుడు రక్తికట్టబోతున్న సభను మాత్రం రసాభాసం చేయవద్దు సుమా ? మనది స్వయం కృతాపరాధం. వీరిని పిలిచి తీసుకొని వచ్చాం.

రాజనారాయణ్.

ఇప్పటికే కాలాతీతం అయింది. బయట ప్రజలు కాచుకొనిఉన్నారు. శ్రీ జయప్రకాశ్ జీ ! తమ నిర్ణయం ప్రకటించాలి.

జయప్రకాశ్

శ్రీ మొరార్జీ దేశాయిగారు ముందు తమ అభిప్రాయం తెలపాలి,

దేశాయి

అందరి అభిమతమే నా అభిమతం. ఈ దేశం త్యాగంచేసిన వారినే ఆరాధిస్తుంది. పద్నాలుగేండ్లు వనవాసం చేసిన రాముడే రాజు - రాముడే దేవుడు. ఈ పద్దెనిమిది నెలల నుండి మనం అందరం కారాగృహశిక్ష అనుభవించిన వాళ్ళమే.

బహుగుణ

(ఆపవారించి జార్జితో) మిత్రమా! ఈ వృద్ధ మేధావిచూడు! - శ్రీ జగ్‌జీవన్ రామ్ చెఱసాలలో లేడుగాబట్టి - ప్రధానిగా ఉండటానికి అనర్హుడని ఎంత సుకు మారంగా చెప్పుతున్నాడో,

జయప్రకాశ్

త్యాగం ఎప్పుడూ గొప్పదే. నేను గూడా చెఱసాలలో ఏకాంత వాసం అనుభవించాను అయితే. ఆ కారణంచేత నాకు పదవి కావాలని కోరుకోవటం లేదుగదా.

మొరార్జీదేశాయి

నేను చెఱసాలలో ఏ ఒక్కక్షణంగూడా ఏకాంతంగా లేను. నా ప్రక్కన ఎల్లప్పుడూ భగవంతుడు ఉన్నాడు.

జయప్రకాశ్

ఢిల్లీ సింహాసనం ధర్మరాజుగారిది. విక్రమాదిత్య సింహాసనం ఎక్కేందుకు ఎన్నో అర్హతలుండాలన్నారు. ధర్మరాజుగారు మొత్తం పదమూడు సంవత్సరాలు అరణ్యవాసం-అజ్ఞాతవాసం చేసి హస్తినాపుర సింహాసనం అధిష్ఠించారు. శ్రీ మొరార్జీదేశాయ్ గారికి పద్దెనిమిదినెలలు మాత్రమేగాడు ఇంచుమించు నెహ్రూగారి తదనంతరం నుండి లాల్ బహాదూర్ శాస్త్రి గారి ఏలుబడి 18 నెలలు ప్రియదర్శినిగారి 11 ఏండ్లు, అధిక మాసాలతో కలిపితే 18 ఏండ్లు పూర్తి అయిన ట్లే - (హర్షధ్వానలు)

రాజనారాయణ్

ఈ పవిత్రభారతదేశంలో శ్రీకృష్ణుడు చెఱసాలలోనే జన్మించినాడు. మన జనతాపార్టీ అట్టి శ్రీకృష్ణ జన్మస్థానంలోనే ఉద్భవించింది.

వేద వేదాంగ విజ్ఞాన వేత్తకంటే
ధర్మ శాస్త్రజ్ఞుడైన మేధావికంటె
మిన్నయై చెఱసాలలో నున్నవాడు
భరత భాగ్యవిధాతయై పరగుచుఁడు!

వాజీపేయి

శ్రీ జయప్రకాశ్ నారాయణగారి నిర్ణయం ప్రకారం సభ్యులందరూ నడచుకోవాలని నిర్ణయించుకున్నట్లే

రాజ్ నారాయణ్

శ్రీ మొరార్జీభాయిగారు జనతాపార్టీకి అధ్యక్షులుగానే ఉంటారని- వారికి పదవీవ్యామోహంలేదనీ వారు వానప్రస్థం స్వీకరించే వయసు. వచ్చింది కాబట్టి కేవలం మనకు ఒక సలహాదారుడుగా ఉంటారని అందరూ అనుకొంటున్నారు.

దేశాయి

చెరసాలలో చాపమీద శయనించినా-ఢిల్లీలో ప్రధానమంత్రి పీఠం మీద కూర్చున్నా నాకు ఒక్కటే. మీ రందరూ నన్ను ప్రధానిగా ఉండ మంటే ఉంటాను. జనకమహారాజు సింహాసనం మీద ఉన్నప్పటికీ వాన ప్రస్థం స్వీకరించిన ట్లే.

రాజ్ నారాయణ్

జాతిపిత-మహాత్మాగాంధీ కనిన కల ఏమిటంటే - ఒక రైతుబిడ్డ భారతదేశ ప్రధానమంత్రి కావాలని.

అదిమ కళయేది? వ్యవసాయ విద్యయే !

రైతుగాక అన్నయెవడు?

గుండె దున్ని రైతు పండించు కొనుచుండు

తరతరాల మంచితనము నాటి!

జయప్రకాశ్

శ్రీ చరణసింగ్ గొప్ప రైతుబిడ్డ..

బహుగుణ

సభాసదులకు నాదొక విన్నపం. శ్రీ జగజీవన్ రామ్ గారిని ప్రధాన మంత్రిని చేయటం అన్నివిధాలా మంచిదనీ సర్వతోముఖ శ్రేయోదకం అని నా అభిప్రాయం. బాగా ఆలోచించండి.

హరిజనుండొకడు సింహాసనం బెక్కగా

కలరూపు ధరియించు గాంధి కలలు!

తమలోన ఒకరు ప్రధాన మంత్రిగ నున్న

జనతపక్షము దీన జనులదౌను;

ప్రతిపక్ష నాయకుల్ పలువురు క్యూలోన

రావచ్చు మనవైపు రంగు మార్చి;

సంకోచములు వీడి స్వాగతంబులు పల్కు

దక్షిణా పథమెల్ల తక్షణమ్ము,

ఉండె-మనముందె జగ్ జీవ నుండు నేడు-

అనుభవజ్ఞుండు-సర్వదా-అర్హుడితడు,

ఇంద్ర జాలినియైన - ఆ ఇందిరమ్మ

జంకె - ఇతనికే - ఆశ్చర్యచకితయగుడు !

జయప్రకాశ్

శ్రీ బాబూ జగజీవన్ రామ్ ఒక వ్యక్తిమాత్రుడు కాడు. ఆయన ఒక వ్యవస్థ! ఒక మహోద్యమం, ఆయన సేవ లేకపోతే నవభారత పునర్నిర్మాణం సవ్యంగా సాగదు.

రాజనారాయణ్

ఇక ఈ వాదోపవాదాలకు స్వస్తి చెప్పడం మంచిది,

నా మూలమున గదా ! శ్రీమతి ఇందిర
హైకోర్టులో పొందె అపజయమ్ము !
నా మూలమున గదా ! భూమండలం బెల్ల
రేయ్ రేలీ పైన దృష్టి నిలిపె !
నామూలమున గదా ! నాయకో త్తము లైరి
ఎన్నికలను నెగ్గి యింత మంది !
నా మూలమున గదా ! నవనవోన్మేషయై
ఈ ప్రజాస్వామ్యమిచట వెలిగె!
అఖిల జనులు-నన్ను-అపరజిమ్మీ కార్ట
రిత టడంచు – ప్రస్తుతించి నారు
అర్హు డెవడు గలడు యావత్ భరత భూమి
ఈ ప్రధాని పదవి కేను గాక ?

కృపలానీ

రాజనారాయణా! నీవేకదా! శ్రీ జయప్రకాశ్ నిర్ణయం ప్రకారం అందరూ నడచుకోవాలని ప్రతిపాదించింది.

రాజనారాయణ్

నిజమే! అయితే శ్రీజయప్రకాశ్ జీ! అవధరింపవయ్యా నావిన్నపం,

నీకు వచింపనేల? నవనీరజనేత్ర! మదీయ దీక్ష - ఏ
కైక మజేయమంచు - ఇది గడ్డము సాక్షిగ చెప్పె దన్-సదా
నీకభిమానపా|తుడగు నేతగ నుందు! ప్రధాని పీఠమున్

నాకు అను గ్రహింపుము - సనామక! ధార్మిక లోకనాయకా!

జయప్రకాశ్

రాజనారాయణ్ జీ ! మనలో మనమాట. మహారథియైన కర్ణుని - అర్జును డొక్కడే జయించలేదు. శ్రీమతి ఇందిర ఏ విధంగా ఓడిందో తెలుసా !

నరవర ! నీచే ! నాచే !

జరిపిన ఎన్నికల చేత ! సంజయ్ చేతన్ ! !

వర జగ్జీవన్ చేతను !

అరయంగా ఇందిరోడె అందరి చేతన్.

ఆదీగాక భారతీయ కమ్యూనిస్టులు శల్యసారధ్యం చేశారు.

వాజపేయి

ఋషులీ దేశమునందు మేలివిలువల్ సృష్టించి యున్నారలో

రషియా మానసపుత్రులార ! -ఇది ఆర్యావర్తదేశంబు-ప్రా

గుషసుల్ చిమ్ము జగద్ధితా కలిత సర్వోత్కృష్ట తేజస్సు, మీ

విష బీజంబులు నాటబోకు డిక కుంభీపాకముల్ మానుడీ !

జార్జి ఫెర్నాండెజ్

అధిక ప్రసంగాలు అనవసరం-ప్రధాన మంత్రి ఎన్నిక సత్వరంగా పూర్తిచేసుకోవటం మంచిది. శ్రీ జయప్రకాశ్ జీ!

జయప్రకాశ్

వాదోపవాదాలకు ఇది తరుణం కాదు.

అగ్గి గుండమ్ములోనుండి కగ్గకుండ

విజయమంది బయలు పడ్డ వీరవరులు

పిదప బుగ్గిలో పొగచూరి బ్రదుక లేక

చచ్చి రెందరో - జాగ్రత్త - జగతిలోన !

రాజనారాయణ్

ఇది సమష్టి విజయం అని నేను అంగీకరిస్తున్నాను. అందరూ పదవి కావాలంటే నేను నా గడ్డం నిమురవలసి వచ్చింది అంతే. జయ ప్రకాశ్ ! తీర్పు చెప్పాలి.

జయప్రకాశ్

మీ అందరికీ_ముందు-ఒక హెచ్చరిక చేయటం నా బాధ్యత.

ఆవహించెనేని అధికార భూతమ్ము

మనిషి-ఎడద-మనసు మార్చివేయు !

పదవి ఎదుగు కొలది హృదయమ్ము క్షీణించు !

మానవుండు మారు దానవుడుగ ! !

ఇది ఐకమత్యానికి సమయం. శ్రీ కృపలానిగారు మీ సమష్టి మనస్సులను లెక్కకట్టియున్నారు. ఆయన ప్రధానమంత్రి పేరు చెప్తారు.

కృపలానీ

అపర ధర్మరాజు శ్రీ మొరార్జీ దేశాయిని మనం ఏకగ్రీవంగా ఎన్నుకుందాము,

(తెరలో

శ్రీ మొరార్జీ దేశాయితకీ జై - జనతాపార్టీ జిందాబాద్.

జయప్రకాశ్ భరతవాక్యము

న్యాయము-సర్వదా-విజయమందుత ! - నీతినిజాయతీలు
ధేయములై సదా భరతదేశ పురోగమనమ్ము సాగుతన్ !
నాయకులెల్ల ధార్మిక వినమ్రవిశుద్ధ చరిత్రులై ప్రజా
శ్రేయముకోరి త్యాగమయ జీవితముల్ వెలయింత్రుగాపుతని

తెర

(ఈ ప్రహసనం ప్రదర్శించగోరేవారు, నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం కు ఫోన్ ద్వారా గాని message ద్వారా గాని, తెలియజేయ గలరు. Phone numbers.9866115177 & 9440495887)